వ్యాపారి రామ్ ప్రసాద్ హత్య కేసు కొట్టివేత

- 2019లో పంజగుట్ట పరిధిలో దారుణ హత్య
- కోగంటి సత్యం సహా 12 మంది నిందితులుగా చార్జిషీట్
- నాంపల్లి కోర్టులో విచారణ
- సరైన సాక్ష్యాధారాలు లేనందున వీగిపోయిన కేసు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన స్టీల్ వ్యాపారి తెలప్రోలు రాంప్రసాద్ హత్య కేసు వీగిపోయింది. విజయవాడలోని కామాక్షి స్టీల్స్‌కు సంబంధించిన వివాదం కారణంగా అక్కడి వ్యాపారి కోగంటి సత్యం సూత్రధారిగా ఈ హత్య జరిగినట్లు పంజగుట్ట పోలీసులు అభియోగాలు మోపారు. ఈ కేసులో ఆయనతో సహా మొత్తం 12 మంది నిందితులుగా ఉన్నారు. సుదీర్ఘ విచారణ తర్వాత సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. విజయవాడకు చెందిన కోగంటి సత్యం కామాక్షి స్టీల్ ట్రేడర్స్ పేరుతో స్టీల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2013లో రాంప్రసాద్‌తో పాటు ఆయన మేన బావమరిది ఊర శ్రీనివాస్ ఈ సంస్థలో భాగస్వాములుగా చేరారు. దీని వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రాంప్రసాద్‌కు సత్యం మధ్య స్పర్థలు వచ్చాయి. 2014లో పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేసుకున్న వీళ్లు వేరుపడ్డారు. ఆ సమయంలో రూ.25 కోట్లు చెల్లిస్తానంటూ సత్యంకు రాంప్రసాద్ సెటిల్‌మెంట్ డీడ్ రాసి ఇచ్చారు. సెటిల్‌మెంట్ డీడ్‌ను బేఖాతరు చేసి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చేశాడు. గచ్చిబౌలిలో నివాసం ఉంటూ పరిగిలో అభిరాం స్టీల్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి వ్యాపారం ప్రారంభించారు. దీని కార్పొరేట్ కార్యాలయం పంజగుట్ట దుర్గానగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో ఉంది. రాంప్రసాద్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న కోగంటి సత్యం తన అనుచరుడు శ్యామ్‌కు ఆ పని అప్పగించాడు. అందుకు అవసరమైన ఖర్చుల కోసం రూ.10 లక్షలు కూడా చెల్లించాడు. ఈ నేపథ్యంలో శ్యామ్ అతడి మనుషులు పంజగుట్టలో కొన్ని రోజులు రెక్కీ చేసి 2019 జులైలో రాంప్రసాద్‌ను హత్య చేశారు. ఆ సమయంలో కోగంటి సత్యం సోమాజీగూడలోని ఓ ప్రముఖ ఆసుపత్రి సమీపంలో ఎదురు చూస్తూ గడిపారన్నది పోలీసుల అభియోగం. ఈ కేసులో నిందితులపై పంజగుట్ట అధికారులు కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

అన్నదమ్ములను చిదిమేసిన రోడ్డు ప్రమాదం!

- గత శనివారం తమ్ముడు మృతి
- చికిత్స పొందుతూ శుక్రవారం అన్న కన్నుమూత
- జర్నలిస్టు కాలనీలో విషాద ఛాయలు


తరుణ్ ఆదిత్య (ఫైల్)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గత శనివారం తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా చికిత్స పొందుతూ అన్న శుక్రవారం తెల్లవారుజామున అపోలో ఆస్పత్రిలో కన్నుమూశాడు. అన్నదమ్ముల మృతితో జర్నలిస్టు కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 70లోని జర్నలిస్టు కాలనీలో పావని ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లోని రాంబాబు సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. అతడి కుమారులు తరుణ్ ఆదిత్య(18), రత్న సత్యసాయి(14) గత శనివారం తమ నాయనమ్మను చూసేందుకు బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 మీదుగా వెళ్తున్నారు. తరుణ్ ఆదిత్య బైక్ నడుపుతుండగా వెనుక రత్న సత్యసాయి కూర్చున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి రాంగ్ రూట్‌లో చట్నీస్ వైపు వెళుతున్న షేక్ అలీముద్దీన్ వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తరుణ్ ఆదిత్య, రత్న సత్యసాయి గాల్లోకి ఎగిరి ఫుట్‌పాత్‌పై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే రత్నసత్యసాయి మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన తరుణ్ ఆదిత్యను అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన షేక్ అలీముద్దీన్ సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అన్నదమ్ముల్లో తరుణ్ ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. తమ్ముడు సత్యసాయి పదవ తరగతి పరీక్షలు రాసి ఇంటర్‌లో చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు.

ప్లాస్టిక్, ఈ-వేస్ట్‌పై వర్క్‌షాప్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ప్లాస్టిక్, ఈ-వేస్ట్‌పై శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ వైస్ ప్రిన్సిపాల్ డా. జీవీ నరసింహారెడ్డి, గౌరవ అతిథులుగా అరబింద్ కుమార్, డా. బాలనర్సయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డా. తిరుమలచారి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన పలువురు వక్తలు ప్లాస్టిక్, ఈ-వేస్టు అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉన్నత విద్యలు, వాటి ప్రాముఖ్యత గురించి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడారు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జెడ్‌సీ మమత కోరారు. శుక్రవారం జీఓసీఎల్‌కు చెందిన నిర్వాహకులు రూ.51.97 లక్షల ఆస్తిపన్నును చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆస్తిపన్నును త్వరగా చెల్లిస్తే కూకట్‌పల్లిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం ఏఈ సాయిప్రసాద్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాల పూడికను ఇప్పటి నుంచే తీసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వరదనీరు వెళ్లడానికి అడ్డంకులు తొలుగుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే 3వ ఫేజ్ మహిళా పార్కు వెనకాల నాలా పూడికతీత పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రంజాన్ చివరి ఇఫ్తార్

మూసాపేట: మూసాపేటలోని జామా మసీదులో కమిటీ మెంబర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన రంజాన్ చివరి ఇఫ్తార్ విందులో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకర్‌రావు, మనోహర్, డాకయ్య, మల్లేష్, వినోద్, తూము శైలేష్ కుమార్, ఉప్పల చంద్రశేఖర్‌గుప్తా, సాయి, ప్రసాద్, మసీదు కమిటీ సభ్యులు, నాయకులు ఖాజా పటేల్, మున్నా పాషా, మోయిజ్, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

కేపీహెచ్‌బీకాలనీ: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ వైస్ చాన్సలర్‌గా నియమితులైన జేఎన్‌టీయూహెచ్ పూర్వవిద్యార్థి ప్రొ. రవీందర్‌నాథ్‌ను జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్‌లు ఘనంగా సత్కరించారు. శుక్రవారం జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయుహెచ్‌కు చెందిన వివిధ విభాగాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లు, ప్రొఫెసర్లు హాజరై రవీందర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని ఏఎస్‌రాజునగర్ కాలనీ, బాగ్‌అమీర్‌లలో కూకట్‌పల్లి సర్కిల్ ఏఎంఓ డా.మమత పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు లేని విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫీల్డ్ అసిస్టెంట్ రజిని, ఎస్ఆర్‌పీ వినయ్‌కాంత్‌రెడ్డి, ఏఎస్‌రాజు నగర్ కాలనీ సభ్యులు సతీష్‌రావు, నరసింహారావు, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖరరావు, సత్యనారాయణ, ఏకాంబరం, నాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూసాపేట పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పిట్ల మనోహర్, ఇన్‌చార్జ్ జి. వినోద్‌కుమార్ శైలేష్‌కుమార్, దోమల శ్రీనివాస్, సాయి ప్రసాద్, కోడిచెర్ల వినోద్ కుమార్, మంగమ్మ, ప్రశాంత్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఇండో-పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నూతనంగా ఇండో-పసిఫిక్ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం దూరవిద్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, ఓయూ వీసీ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు ఇండో- పసిఫిక్ అధ్యయన కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇండియన్-పసిఫిక్ మహాసముద్ర తీర దేశాల మధ్య సత్సంబంధాలపై విస్తృతంగా అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ ఓఎస్‌డీ అంబాసిడర్ రాజశేఖర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, అధ్యాయాన కేంద్రం డైరెక్టర్ ప్రొ.జేఎల్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా రంజాన్ వేడుకలు జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. రంజాన్ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోనల్ డీసీపీలు, ఏసీపీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సున్నితమైన ప్రాంతాల్లో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సామూహిక ప్రార్థనా కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తును పర్యవేక్షించాలని, ఆయా ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరుపై నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సామూహిక ప్రార్థనల సమయంలో రోడ్ల మీద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ బాలస్వామి, ఏసీపీలు జావేద్, జగదీష్ చందర్ పాల్గొన్నారు.

ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ముస్లిం సోదరులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఈద్ ఉల్ ఫితర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా పరిగణిస్తారన్నారు. రంజాన్ మాసంలో ప్రతి వ్యక్తి మానసిక పరివర్తన చెంది ప్రేమమూర్తిగా మార్పు చెందుతారని, ఈ మాసంలో ఆధ్యాత్మిక ఆరాధనతో అనుబంధం మరింత బలపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు .సర్వ మానవాళి సమానత్వాన్ని చాటుతూ, దాతృత్వాన్ని అలవరచే రంజాన్ పండుగ వేళ ఇస్లాంను గౌరవించే ప్రతి ఒక్కరి కుటుంబంలో ఆనందం వెల్లి విరియాలన్నారు

లారీ ఢీకొని యువతి దుర్మరణం

తండ్రికి తీవ్ర గాయాలు

లంగర్‌హౌస్: వేగంగా వచ్చిన లారీ వెనక నుంచి బైక్‌ను ఢీకొనడంతో కుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా ఆమె తండ్రి తీవ్రంగా గాయపడిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ గౌస్ గురువారం రాత్రి తన కుమార్తె లు సయ్యద్ నస్రీన్ బేగం(18), సయ్యద్ నమీరా బేగంతో కలిసి బైక్‌పై అత్తాపూర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. రేతిబౌలి చౌరస్తా సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ చక్రాల కింద పడ్డ నస్రీన్ బేగం అక్కడికక్కడే మృతి చెందింది. వెనుక చక్రాల కింద పడిన సయ్యద్ గౌస్‌కు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు అతడి ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు.

జీఓ.58, 59 అర్హులకు పట్టాలు అందజేత


పట్టాలు అందజేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలంలోని కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలో జీఓ.58, 59కి దరఖాస్తు చేస్తుకున్న వారికి ప్రభుత్వం యాజమాన్య హక్కు కల్పిస్తోందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సర్వే అనంతరం అర్హులైన వారికి శుక్రవారం తహసీల్దార్ గోవర్ధన్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఆయన పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, సమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, కాశీనాథ్‌యాదవ్, అనిల్, హరినాథ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేసిన సురభి రమేష్‌రావును సన్మానిస్తున్న ఆలయ అధ్యక్షుడు ప్రభాకర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ సాయినగర్‌వెస్ట్‌లో నెలకొన్న ఎర్ర పోచమ్మ ఆలయంలో 41వ రోజు మండల కార్యక్రమం సందర్భంగా ఆలయ అధ్యక్షుడు గుండడి ప్రభాకర్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదిత్యానగర్ ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురభి రమేష్ ఆలయ నిర్మాణానికి ఆయన తల్లిదండ్రులు సురభి దామోదర్‌రావు, జయప్రదల జ్ఞాపకార్థం 1 లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి మెమొంటోతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివరాజ్ గౌడ్, సీతారామరాజు, సుబ్బారావు, నాగేశ్వరరావు, గోపీచారి, శ్రీధర్‌రావు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి అధికార పార్టీలోకి దొంగ చాటున వెళ్లారని విమర్శించారు. వారికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగరవేద్దామని తెలిపారు. ప్రధాని మోదీపై అపారమైన నమ్మకంతో వందలాది మంది బీజేపీలో చేరుతున్నారని అన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నర్సింగరావు, ఏకాంత్‌గౌడ్, శ్రీహరియాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌రావు, శ్రీనివాస్, వెంకటస్వామిరెడ్డి, రాజ్ పాల్గొన్నారు.

పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయండి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల, అంబేడ్కర్ విగ్రహం వెనకాల మసీదు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని కూకట్‌పల్లి జెడ్‌సీ మమతకు శుక్రవారం సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో వాహనాలు వేగంగా రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆమెను కోరారు. దీనికి జెడ్‌సీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం. శంకర్, బి.శ్రీనివాస్, మహేష్‌గౌడ్, సాదా మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


పూజ మృతదేహం

నిజాంపేట్: ఓ మహిళను ఇద్దరు యువకులు దారుణంగా హత్య చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఇంద్రానగర్‌లోని రుచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన కుమార్ హోటల్ వెనుక గదిలో నివాసం ఉంటున్నాడు. గురువారం డ్యూటీ లేకపోవడంతో బయటికి వెళ్లిన అతను రాత్రి తన స్నేహితుడు విజయ్‌తో కలిసి హోటల్‌లో భోజనం తీసుకుని గదికి వెళ్లారు. శుక్రవారం అతను డ్యూటీకి రాకపోవడంతో హోటల్ యజమాని అతను ఉంటున్న గది తలుపులు తెరిచి చూడగా ఓ మహిళ మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే అతను బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించారు..

డబ్బుల విషయంలో గొడవతోనే..

చింతల్ ప్రాంతానికి చెందిన పూజ(45) ఇళ్లల్లో పని చేస్తూ తన ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తోంది.. గురువారం సాయంత్రం విజయ్, కుమార్ కేపీహెచ్‌బీ నుంచి ఆమెను తమ గదికి తీసుకువచ్చాడు. అయితే డబ్బుల విషయంలో గొడవ జరగడంతో ఆమె వెళ్లిపోయేందుకు సిద్ధం కావడంతో ఆగ్రహానికి లోనైన వారు ఆమె నోట్లో బట్టలు కుక్కి ఊపిరాకుండా చేసి హత్య చేసినట్లు అంగీకరించారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ సమన్ పరిశీలించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీఆర్ఎస్ బహిరంగ సభపై టెలి కాన్ఫరెన్స్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ శుక్రవారం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 25న జరిగే బహిరంగ సమావేశానికి సంబంధించి చర్చించారు. ప్రతి డివిజన్‌లో కార్పొరేటర్లు, కార్యకర్తలతో సహా జెండా పండుగ నిర్వహించి అనంతరం ర్యాలీగా తెలంగాణ గార్డెన్స్‌లో జరిగే బహిరంగ సభకు ర్యాలీగా చేరుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్పొరేటర్‌లు దగ్గరుండి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రంగా ఉన్న దృష్ట్యా అందరికి దారిలో మంచినీటి సౌకర్యం కూడా కల్పించే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

రంజాన్ తోఫాల పంపిణీ

దుండిగల్: రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలకు శుక్రవారం కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వ మహేష్‌యాదవ్, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రభు, కుమ్మరి మల్లేష్, సిరాజ్, ఇమ్రాన్, ఆజం, రాజియుద్దీన్, సాదిఖ్, మునీర్, ఇమ్రాన్, అలీమ్, ఎజస్, ముక్తార్, అజ్మత్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా సురేందర్‌గౌడ్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ ఎం.సురేందర్‌గౌడ్ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఇన్‌స్పెక్టర్ నరసింగరావు సీపీఓ అటాచ్డ్ క్రైమ్ వింగ్‌కు బదిలీపై వెళ్లారు. సురేందర్‌గౌడ్ మాదాపూర్ సీసీఎస్ నుంచి కూకట్‌పల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు. నేరాలను నియంత్రించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

మూసాపేట: కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సురేందర్‌గౌడ్‌ను మూసాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చున్నా పాషా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ యాదవ్, ఉదయ్‌కుమార్,తూము సచిన్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సీఐ నర్సింగరావుకు వీడ్కోలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందిన టి.నర్సింగరావుకు శుక్రవారం వీడ్కోలు తెలిపారు. వీడ్కోలు తెలిపిన వారిలో కంచనపల్లి నాగరాజు, సుభాష్‌గౌడ్, కె. వెంకటరమణ, ఆరోగ్య రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. క్రాంతికుమార్‌ను శుక్రవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, కృష్ణారావు, భాస్కర్‌రెడ్డి, కట్టా శ్రీనివాసరావు, కొండారెడ్డి పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

పబ్లిక్ కాంటాక్ట్‌కు విశేష స్పందన



బాలాజీనగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ శిరీష తదితరులు



హైదర్‌నగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా పలు డివిజన్ కార్పొరేటర్లు అధికారులతో కలిసి పాల్గొని వివిధ కాలనీల ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. పబ్లిక్ కాంటాక్ట్ ద్వారా ప్రజల వద్దకు వచ్చే అధికారులకే తమ సమస్యలను వివరించి పరిష్కరించుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ల కార్పొరేటర్లు శిరీష బాబూరావు, నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, ముద్దం నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో.. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



నాగిరెడ్డి కాలనీలలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

సామాజిక సేవా కార్యక్రమాలకే ఉదాసీన్ భూములు



శ్రీమహంత్ రఘుమునీజీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



రఘుమునీజీతో ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మఠాధిపతి శ్రీమహంత్ రఘుమునీజీకి కృతజ్ఞతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఐడీపీఎల్ కంపెనీని ఆనుకొని ఉన్న ఉదాసీన్ మఠానికి చెందిన 540 ఎకరాల భూమిని సామాజిక సేవా కార్యక్రమాలు, సనాతన ధర్మస్థాపన కార్యక్రమాలకు వినియోగించేందుకు అంగీకరించడం కూకట్‌పల్లి ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. విలువైన మఠం భూములను ప్రజల సేవా కార్యక్రమాల కోసం కేటాయించిన మఠాధిపతికి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం పొందారు. శుక్రవారం ఉదాసీన్ మఠాధిపతి శ్రీమహంత్ రఘుమునిజీని కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు ఆయన ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆయన కూకట్‌పల్లి మఠం భూముల విషయమైన చర్చించారు.

- ఈ సందర్భంగా రఘుమునిజీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ, దేవాదాయశాఖ సహాయ సహకారాలతో భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోగలిగామని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకే మఠం భూములను వినియోగిస్తామని పేర్కొన్నారు. సామాజిక సేవలోనే దైవత్వం దాగి ఉందన్నారు. మఠం ఆధీనంలోని భూములో జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందించాలని కోరారు. సుమారు 10వేల మంది అనాథ పిల్లలకు వసతి, చదువు, వైద్యం తదితర సేవా కార్యక్రమాల నిర్వహణకు అవసరమయ్యే ప్రణాళికలను సిద్ధం చేసి ఇవ్వాలని కోరారు.
- ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వేలాది ఎకరాల భూములతో ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న ఉదాసీన్ మఠానికి తోడ్పాటును అందించే అవకాశం లభించటం అదృష్టంగా భావిస్తామని అన్నారు. అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసి పూర్తి సహకారం అందించేలా చూస్తామని తెలిపారు. నగరంలోని కేబీఆర్ పార్కును మించిపోయేలా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ల నిర్మాణం, యోగా, మెడిటేషన్ కేంద్రాలు, ప్రతి రోజూ పదివేల మందికి అన్నప్రసాద వితరణ, సత్రాలు, యాగశాలలు, ఉచిత వైద్య కేంద్రాల నిర్మాణం వంటివి చేపట్టడం ద్వారా ఉదాసీన్ మఠం సేవలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించామని తెలిపారు. మునీజిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న వారిలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మఠం ప్రతినిధి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభను జయప్రదం చేయండి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. నరేష్

కూకట్‌పల్లి: చేవెళ్లలో జరిగే విజయ సంకల్ప సభను జయప్రదం చేయాలని, ఈ సంకల్ప సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 23న విచ్చేయనున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కొరదాల నరేష్ తెలిపారు. అ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం మాటల తోటి కాలం గడిపేస్తోందన్నారు. పనులు మాత్రం జరగటం లేదని నరేష్ ఆరోపించారు. పేపర్ లీకేజీలు ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చుకొని కనీసం ఏ ఒక్క పోటీ పరీక్షలను విజయవంతంగా నడపలేని చేతకాని ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం ఆటలాడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా నిరుద్యోగ భృతిని ఇస్తారని ఎన్నికల్లో ప్రమాణాలు చేసి ఇప్పుడు కనీసం దాని గురించి మాట్లాడటం లేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయో ఈ అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. బీజేపీ చేవెళ్ల సభ ద్వారా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలలో విజయకేతనం ఎగరవేయటం బీజేపీ లక్ష్యమని తెలిపారు.

ఏటీబీ మెషిన్ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీలోని రైతుబజార్‌లో ఎనీ టైమ్ బ్యాగ్ (ఏటీబీ) మెషిన్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ మమతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఏటీబీ మెషిన్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్లాత్ కవర్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

– కేపీహెచ్‌బీకాలనీ



రైతుబజార్‌లో ఏటీబీ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జెడ్సీ మమత